## తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.9 కోట్లు

### ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

తాగునీటి సమస్య పరిష్కారానికి మొగల్తూరులోనే రూ.తొమ్మిది కోట్ల నిధులు వెచ్చించామని ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు తెలిపారు. మంగళవారం సాయంత్రం మొగల్తూరులోని సమగ్ర రక్షిత మంచినీటి పథకం అభివృద్ధికి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రూ.84 లక్షలతో పోయెచ్చర్ నిర్మాణం అదనపు పైపులైన్ల ఏర్పాటు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేయనున్నామన్నారు. ప్రతి ఇంటికీ స్వచ్ఛ జలాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో అన్ని తాగునీటి పథకాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, కవురు సీతామాలక్ష్మి, సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, మోటుపల్లి రామ భాస్కరరావు, తన్నీడి గిరి పాల్గొన్నారు.

# మళ్లీ వరద భయం..!

- పెరుగుతున్న గోదావరి ఉధృతి
- కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ప్రజల ఆందోళన
- భద్రాచలం వద్ద 32 అడుగులకు నీటిమట్టం
- పొంగుతున్న గుండేటి, ఎద్దువాగులు
- 24 గ్రామాలకు రాకపోకలు బంద్
- వరద పెరిగితే పత్తి, మిర్చి రైతులకు కోలుకోలేని దెబ్బ

కుక్కునూరు-దాచారం మధ్య కాజ్‌వేను ముంచెత్తిన వరద

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గోదావరికి వరద ఉధృతి పెరుగుతుండటంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలను మళ్లీ వరద భయం వెంటాడుతోంది. ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి వరద ఉధృతి పెరుగుతోంది. మంగళవారం నాడు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 32 అడుగులకు చేరింది. దీంతో ఎద్దువాగు, గుండేటి వాగులు పొంగిపొర్లుతున్నాయి. ఎద్దువాగు పొంగడంతో వేలేరుపాడు మండలంలోని బోళ్లపల్లి, చిగురుమామిడి మధ్య ఉన్న కాజ్‌వేపై వరద నీరు చేరింది. దీంతో కొయిదా, కట్కూరు, కాకిసనూరు, బోళ్లపల్లి, టేకూరు వంటి 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కుక్కునూరు, దాచారం మధ్య గుండేటి వాగుపై ఉన్న కాజ్‌వే మునగడంతో బెస్తగూడెం, సీతారామపురం, నెమలిపేట, గుణ్ణంబోరు వంటి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ గ్రామాలకు వెళ్లాలంటే 15 కిలోమీటర్లు చుట్టు తిరిగి వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. దీంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ప్రజలను వరద భయం వెంటాడుతోంది. ఈసారి వరద వస్తే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. జులై నెలలో వరద వచ్చి తగ్గడంతో రైతులంతా వేలాది ఎకరాల్లో పత్తి, మిర్చి సాగు చేశారు. పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టారు. ఇప్పుడు వరదొస్తే పంటంతా దెబ్బతినే ప్రమాదం ఉంది. దీంతో రైతులు పెట్టిన పెట్టుబడులు నష్టపోయి తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. దీంతో రైతులకు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఆ పొలాలు ప్రాజెక్టు ముంపులో ఉన్నవి కావడంతో పంట నష్టపరిహారం కూడా ప్రభుత్వం అందించడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

**15 రోజుల వ్యవధిలో మళ్లీ వరద**

గడిచిన జులై 20వ తేదీ తర్వాత గోదావరికి వరద పోటెత్తింది. దాదాపు 45 గ్రామాలు ముంపుబారిన పడ్డాయి. ఎక్కడికక్కడే రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామాల్లోకి వరద నీరు చేరడంతో 13,764 మంది వరద బాధితులుగా మారి పునరావాస కేంద్రాలకు తరలివెళ్లారు. రెండు మండలాల్లో 12 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి 4,275 మందిని తరలించారు. మిగిలిన 9,589 మంది కొండలు, గుట్టలకు చేరి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కటిక చీకట్లో కాలం గడిపారు. ప్రభుత్వం నిత్యావసర వస్తువులు వంటివి అందించినా తాగునీరు వంటి సమస్యలతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆగస్టు ఐదో తేదీకి వరద తగ్గుముఖం పట్టింది. దీంతో పునరావాస కేంద్రాలకు చేరిన బాధితులంతా గ్రామాలకు చేరి ఇళ్లను బాగు చేసుకున్నారు. పట్టుమని 15 రోజులు గడవకముందే మళ్లీ గోదావరి వరద పెరుగుతుండటం అక్కడి ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. వరద పెరిగితే మళ్లీ పునరావాస కేంద్రాలకు వెళ్లాల్సిన దుస్థితి రానుంది. పోలవరం ప్రాజెక్టులో భాగమైన కాఫర్ డ్యామ్‌ను ముందుగానే నిర్మించడంతో చిన్నపాటి వరదకు సైతం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని గ్రామాలు ముంపుబారిన పడుతున్నాయి. 2022 వరదలకు దాదాపు 95 గ్రామాలు ముంపుబారిన పడగా 20 వేల మందికిపైగా వరద బాధితులుగా మారి పునరావాస కేంద్రాలకు చేరారు. ఈ ఏడాది జులైలో వచ్చిన వరదకు అదే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం మాత్రం ముంపుగ్రామాలకు పునరావాస ప్యాకేజీ ఇచ్చి తరలించడం లేదు. దీంతో ప్రతియేటా రెండు మండలాల్లోని ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ తల్లడిల్లుతున్నారు.

అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

## కోర్సుల పట్ల అవగాహన కల్పించాలి

### జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

ఇంటర్మీడియట్ స్థాయి నుండే డిగ్రీ కోర్సుల పట్ల అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ జిల్లాలోని ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో సమావేశమై కాంట్రాక్టు లెక్చర్ల బదిలీలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఇంటర్ పూర్తయిన తర్వాత ఏయే కోర్సులు చదివితే ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయనే వాటిని ఇంటర్మీడియట్ స్థాయి నుండే వారికి అవగాహన కల్పించాలన్నారు. సరైన అవగాహన లేక ఎవరో ఒకరిని అనుకరించి వారు చేరిన కోర్సులోనే చేరడం వల్ల ప్రయోజనం అంతంత మాత్రంగానే ఉంటుందన్నారు. ఇంటర్మీడియట్ స్థాయి వరకూ పాఠ్యాంశాలను విపులీకరించి చెప్పేందుకు ఉపాధ్యాయులుగా శిక్షణ పొందిన లెక్చరర్ల అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. విద్యార్థి దశలోనే సరైన దిశా నిర్దేశం చేస్తేనే విద్యార్థులు భవిష్యత్తులో రాణించగలుగుతారని తెలిపారు. జిల్లాలోని వివిధ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న 26 మంది కాంట్రాక్టు లెక్చరర్లు ఒకే కాలేజీలో ఐదు సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న వారిని నిబంధనల మేరకు తప్పనిసరిగా బదిలీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్స్, ఆర్‌ఆర్ డిఎస్ కళాశాల ప్రిన్సిపల్ వికెజె ప్రసన్న, ఎఎస్ఎన్‌ఎంజిడిసి బాలుర కళాశాల డాక్టర్ టి.రాజరాజేశ్వరి, పాలకొల్లు డిఎన్‌ఆర్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శోభారాణి పాల్గొన్నారు.

ముదునూరికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

## అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

### ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరికి వినతి

ప్రజాశక్తి - మొగల్తూరు

అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాద రాజుకు మంగళవారం సాయంత్రం అంగన్‌వాడీలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడారు. అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత, ఇఎస్‌ఐ, పిఎఫ్ గ్రాడ్యుటీ, సుప్రీంకోర్టు తీర్పుమేరకు అమలు చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాల పెంచాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షరాలు మేడిద స్వర్ణలత, పెద్దింట్లు, పార్వతి, సత్యవతి పాల్గొన్నారు.

## కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

### అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - భీమవరం

జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి వివిధ అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే పూర్తయిన జగనన్న కాలనీల్లో అవసరమైన మౌలిక వసతులను త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెలాఖరున ముఖ్యమంత్రి కాకినాడ జిల్లా సామర్లకోటలో జగనన్న కాలనీని ప్రారంభించనున్నారని, అదేవిధంగా పశ్చిమగోదావరి జిల్లాలో దువ్వ లేఅవుట్‌లోని గృహాలను మంత్రి ప్రారంభించనున్నారని తెలిపారు. జిల్లాలో అన్ని లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలతో పాటు అంతర్గత రోడ్లు, డ్రెయిన్లు, విద్యుదీకరణ, తాగునీటి వసతులు కల్పించాలన్నారు. అంతర్గత రోడ్ల నిర్మాణం, కాలనీలకు స్వాగత ద్వారాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. స్వాగత ద్వారాల నిర్మాణంలో అలక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పనుల్లో హార్టికల్చర్ కింద మంజూరు చేసిన పనులన్నీ ప్రారంభించి రేపు సాయంత్రానికి రిపోర్ట్ అందించాలన్నారు. హౌసింగ్ కాలనీలో ఇంకుడు గుంటల ఏర్పాటుకు నివేదిక అందజేయాలన్నారు. నాడు - నేడు పెండింగ్ పనులన్నీ వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలకు సంబంధించిన పనులను వెంటనే మొదలుపెట్టి పూర్తిచేయాలని ఆమె సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఎస్‌టివి.రాజేశ్వరరావు, హౌసింగ్ పీడీ ఆర్‌సి.ఆనంద్‌కుమార్, డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు, డిఆర్‌డిఎ పీడీ వేణుగోపాల్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ, అధికారులు పాల్గొన్నారు.

## వైఎస్‌ఆర్ బీమా నమోదులో చొరవ చూపాలి

ప్రజాశక్తి - భీమవరం

వైఎస్‌ఆర్ బీమా నమోదు, క్లైమ్‌లు అప్లోడ్ చేయడంలో అధికారులు చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ పి.ప్రశాంతి వైఎస్‌ఆర్ బీమా పథకంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్‌ఆర్ బీమా నమోదు జిల్లాలో 97 శాతం పూర్తయ్యిందని, మిగిలిన 3 శాతం పెండింగ్‌కు గల కారణాలను తెలుసుకొని నూరు శాతం నమోదు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏప్రిల్ 1, 2020 నుంచి అక్టోబర్ 20, 2020, జూన్ 1.2021 నుంచి జులై 30, 2021 నో పాలసీ పిరియడ్‌లో అందిన 2,875 దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వానికి లేఖ రాయాలని డిఎల్‌డిఒ, కార్మిక శాఖ అధికారులను కలెక్టర్ సూచించారు. క్లైములు రిజిస్ట్రేషన్ చేయడం, అప్లోడ్ చేయడం సహజ మరణం అయితే ఏడు రోజులు, ప్రమాదవశాత్తూ మరణం అయితే 14 రోజుల్లోపు, నిర్ణీత గడువులోపు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎస్‌ఎస్. వేణుగోపాల్, డిఎల్ డిఒ కెసిహెచ్ అప్పారావు, జిల్లా కార్మిక శాఖ అధికారి ఎ.లక్ష్మి, ఎపిఎం పాల్గొన్నారు.

## గృహ నిర్మాణ శాఖ పీడీగా ఆనంద్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిగా పనిచేస్తున్న ఆర్‌సి. ఆనంద్‌కుమార్‌ను డిప్యూటేషన్‌పై జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమిస్తూ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ జి.లక్ష్మీషా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఆనంద్‌కుమార్ బాధ్యతలు చేపట్టి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేదల గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని, నిర్మాణాల్లో రాష్ట్రంలోనే జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని కోరారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హౌసింగ్ పీడీ ఆనంద్ కుమార్

## చరిత్రలో నిలిచిపోయే ఆవిష్కరణలు చేపట్టాలి

### నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ప్రమోద్ పడోలే

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దేశ భవిష్యత్తు యువతరానిదేనని, చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే ఆవిష్కరణల రూపకల్పనకు విద్యార్థులు పాటుపడాలని ఏపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే సూచించారు. బీటెక్ ప్రథమ సంవత్సరం 2023 - 24 విద్యార్థులకు ప్రాంగణంలోని రవీంద్ర కళాభారతి ఆడిటోరియంలో ఇండక్షన్ ప్రోగ్రామ్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ప్రమోద్ పడోలే ఆన్‌లైన్ ద్వారా మాట్లాడుతూ నిర్దేశించుకున్న లక్ష్యాలను కాలయాపన చేయకుండా పట్టుదలతో సాధించిన విద్యార్థులు మార్గదర్శకులై ప్రకాసిస్తారని తెలిపారు. ఏ వృత్తిలోనైనా రాణించాలంటే ఆధునిక సాంకేతిక నైపుణ్యాలపై పట్టు సాధించాలన్నారు. విద్యనభ్యసించాల్సిన వయసులో తాత్కాలిక ఆనందాలకు లొంగిపోతే భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ పరిశోధనల జోరుతోనే వైజ్ఞానిక పురోగతి సాధ్యమవుతుందన్నారు. విద్యార్థులు ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. డీన్‌లు డాక్టర్ జిబి.వీరేష్‌కుమార్, డాక్టర్ కార్తీక్ శేషాద్రి, డాక్టర్ ఎస్.జయరామ్ మాట్లాడుతూ సంస్థ కల్పిస్తున్న వనరులను సద్వినియోగం చేసుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ ఇండక్షన్ కార్యక్రమం 26వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 480 సీట్లకు గాను ఇప్పటివరకూ 463 మంది విద్యార్థులు రిపోర్ట్ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు డాక్టర్ కిరణ్ తీపర్తి, డాక్టర్ తపస్, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ రాముడు, డాక్టర్ సుదర్శన్ ధ్రువ, డాక్టర్ తలారి రేష్మా, డాక్టర్ సౌమ్య పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రిజిస్ట్రార్ దినేష్ శంకర్‌రెడ్డి

## ప్రసవాల సంఖ్య పెంచాలి : కలెక్టర్

ప్రజాశక్తి - గణపవరం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే డెలివరీ కేసులు జరగాలని, సుఖ ప్రసవాలు జరిపి లక్ష్య సాధనకు వైద్యాధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులకు సూచించారు. మంగళవారం గణపవరం పిహెచ్‌సిని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాల్లో ప్రతి నెలా 20 ప్రసవాలు జరగాలని, ఈ నెలలో ఎందుకు తక్కువ జరిగాయని అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు ఆరోగ్య కేంద్రం ద్వారా అన్ని రకాల సేవలందించాలని చెప్పారు. ప్రసవాల సంఖ్య పెరగకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది పూర్తిగా ఉన్నా ఎందుకు టార్గెట్ పూర్తి చేయలేకపోతున్నారని వైద్యాధికారులను ప్రశ్నించారు. ఈ నెలలో టార్గెట్ అధిగమించి తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. రహదారి పక్కన ఉన్న పిహెచ్‌సికి ఒపిలు ఎంత మంది వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఉన్న రోగులతో మాట్లాడారు. పిహెచ్‌సి అభివృద్ధికి నిధులు కొరత లేదన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డి. మహేశ్వరరావు, తహశీల్దార్ పి.లక్ష్మి, విఒ పిఆర్‌డి టివి సత్యనారాయణ, ఆరోగ్య కేంద్రం డాక్టర్ పి.సంతోషనాయుడు పాల్గొన్నారు.

పిహెచ్‌సిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

## విఒఎల సమస్యలు పరిష్కరించాలని ధర్నాలు

ప్రజాశక్తి - తణుకురూరల్

విఒఎల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక డ్వాక్రా భవనం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎపిఎం రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ.26 వేలు ఇవ్వాలని, మొబైల్ బుక్ కీపింగ్‌లో వస్తున్న సాఫ్ట్‌వేర్ సమస్యలు పరిష్కరించాలని, లోకో యాప్ కోసం ప్రభుత్వం 5జీ ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ విఒఎలు అనేక రకాల సేవలు ప్రజలకందిస్తున్నారన్నారు. విఒఎల కాలపరిమితి సర్క్యులర్‌ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్కరికీ రూ.10 లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వాలన్నారు. రాజకీయ ఒత్తిళ్లు, అధికారుల వేధింపులు ఎక్కువై విఒఎలు మానసిక సమస్యల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విఒఎల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో లీలావతి, పార్వతి, జ్యోతి, డి.దేవి, ఎ.రాజేశ్వరి, రత్నం, భాగ్యలక్ష్మీ, బేబిరాణి పాల్గొన్నారు.

తణుకు : ఎపిఎంకు వినతిపత్రం అందజేస్తున్న విఒఎలు

**గణపవరం :** డ్వాక్రా యానిమేటర్లకు కనీస వేతనం రూ.25,000 ఇవ్వాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో యానిమేటర్లు ఎపిఎంకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి పి.గోవింద్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి స్వయం సేవా సంఘాలకు సేవలందిస్తున్న యానిమేటర్లు ఎనిమిది వేల రూపాయల జీతంతో ఎలా బతుకుతారన్నారు. యానిమేటర్ల మండల అధ్యక్ష కార్యదర్శులు తోట పద్మావతి. ఎలిపే సుజాత మాట్లాడుతూ యానిమేటర్లకు ఇన్సూరెన్స్ వర్తింపుజేయాలన్నారు. కార్యక్రమంలో యానిమేటర్లు కె.ఝాన్సీలక్ష్మి, పావని, కె.రత్న మాణిక్యం, ఎస్.భారతి పాల్గొన్నారు.

## ప్రణాళికాబద్ధంగా రీసర్వే చేయాలి : జెసి

ప్రజాశక్తి - పాలకొల్లు

రీ సర్వేపై పూర్తి అవగాహన కలిగి, ప్రణాళికా బద్ధంగా పని చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి అన్నారు. మంగళవారం పాలకొల్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో పాలకొల్లు, పోడూరు, యలమంచిలి మండలాలకు సంబంధించిన రెవెన్యూ అధికారులకు నిర్వహించిన ఒక రోజు అవగాహనా సదస్సులో జాయింట్ కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రీ సర్వేలో భాగస్వాములైన వారందరూ కలిసికట్టుగా పని చేసినట్లయితే నాణ్యమైన రీ సర్వే జరుగుతుందన్నారు. రీ సర్వేలో రైతులు భాగస్వాములుగా ఉండాలన్నారు. వారికి నోటీసులు అందజేయాలని, వారికి ఎంత అవగాహన కలిగి ఉంటే అంత బాగా రీసర్వే జరుగుతుందని తెలిపారు. రీ సర్వేలో సులువైన పద్ధతులను పాటించి మంచి రిజల్ట్ తీసుకురావాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సర్వే అధికారి కె.జాషువా, తహశీల్దార్లు సిహెచ్ పెద్దిరాజు, ఆర్‌వి.కృష్ణారావు, ఎం.సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

## ఎబిఎస్‌కెవికెలో ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పెద్దలు, పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య శిబిరాన్ని మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో మంగళవారం నిర్వహించారు. పెద్దలకు కార్డియో సర్జన్, స్థానిక తేజ హాస్పిటల్ అధినేత డాక్టర్ పొనమండ చంద్రశేఖర వర్మ ఇసిజి, ఎకో పరీక్షలు చేసి వైద్య సేవలందించారు. విజయవాడ ఆంధ్రా హాస్పిటల్‌కు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ 15 సంవత్సరాల్లోపు పిల్లలను పరీక్షించి వైద్య సేవలందించారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ ఎబిఎస్‌వికె వైద్య సహాయ కేంద్రానికి సహకారం అందిస్తున్న వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు, కార్యదర్శి మంతెన కృష్ణంరాజు, ఎస్‌ఎల్‌జి హాస్పిటల్స్ (హైదరాబాద్) అధినేత దండు శివరామరాజు, అల్లూరి ట్రస్టీ బి.బలరాం, డాక్టర్ విక్రమ్, చంద్రశేఖర్ వర్మలను అభినందించారు. కార్యక్రమంలో వసుధ కోఆర్డినేటర్ ఎంవి.రామరాజు, అల్లూరి సీతారామరాజు, ఎస్‌ఎల్‌జి హాస్పిటల్స్ ప్రతినిధి వై.రణదివే పాల్గొన్నారు.

చిన్నారులకు గుండె పరీక్ష చేస్తున్న వైద్యులు

## అర్హులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

### మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు

**నరసాపురంటౌన్ :** అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం పట్టణంలోని రాయపేటలో శ్రీగౌతమి జూనియర్ కాలేజీలో ఓటుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఓటు వేసేందుకు ముఖ్యంగా యువత ఆసక్తి చూపాలన్నారు. 18 సంవత్సరాల వయస్సు కలిగిన యువత తమ ఓటు హక్కును నమోదు చేయించుకువాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, శ్రీగౌతమి విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ చినమిల్లి దుర్గాప్రసాద్, సూపరింటెండెంట్ ఎండి.గఫ్ఫార్‌ఖాన్, ఎం.రామచంద్రరావు, పాల్గొన్నారు.

## అధికారులు జవాబుదారీగా ఉండాలి

### ఉండి మండల సమావేశంలో ఎంపిపి నారాయణరాజు

**ప్రజాశక్తి - ఉండి**

అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటూ సేవలందించాలని ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అన్నారు. మండలానికి చెందిన నీటిపారుదల శాఖాధికారుల పనితీరుపై పలువురు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు నీటిపారుదల శాఖ అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరుకువాడ గ్రామ సర్పంచి కొండవీటి సాంబశివరావు మాట్లాడుతూ రెండు రోజుల క్రితం రాజులపేట వంతెన సమీపంలోని పంట కాలువలో మృతదేహం కొట్టుకురావడంతో నీటిపారుదల శాఖ అధికారులకు తెలియపరిస్తే వారు స్పందించలేదని, గ్రామ సర్పంచినైనా తనకే సమాధానం లేకపోతే మండల ప్రజలకు ఏం స్పందిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరుకువాడ శివారు ప్రాంత పొలాలకు సాగు నీరు అందించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన ప్రతినిధి ఆర్.కృష్ణకుమార్ మాట్లాడుతూ తమ ఆరోగ్య కేంద్రం పరిధిలో పాముకాటుకు, కుక్కకాటుకు అవసరమైన మందులు అందుబాటులోనే ఉన్నాయని తెలిపారు. విద్యుత్ కార్యాలయం ఎఇ ముదునూరి మాధవరాజు మాట్లాడుతూ మండల పరిధిలో కొత్తగా యండగండి, అర్తమూరు, వాండ్రం గ్రామాల్లో సబ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు మాట్లాడుతూ వివిధ శాఖలకు చెందిన అధికారులు పనితీరు మార్చుకోవాలని, ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటూ సేవలందించాలన్నారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ఉత్తమ అవార్డు సాధించిన ఉండి విద్యుత్ కార్యాలయం అసిస్టెంట్ ఇంజినీర్ ముదునూరి మాధవరాజును, నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆకివీడు సిఐ కెవివిఎన్.సత్యనారాయణను సత్కరించారు.

## ప్రజలు శాంతి మార్గంలో పయనించాలి

**ప్రజాశక్తి - గణపవరం**

ప్రజలందరూ శాంతి మార్గంలో పయనిస్తూ ప్రపంచ దేశాలకు ఆదర్శం కావాలని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. మంగళవారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గణపవరం డిగ్రీ కాలేజీ వద్ద నుంచి స్థానిక పోలీస్ ఐలాండ్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వాసుబాబు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ప్లాస్టిక్ వాడకం నిషేధాన్ని అందరూ పాటించాలన్నారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నాయకులు కాకర్ల వినాయక, వంకాయల రామారావు, పాతపాటి హరికుమార్‌రాజు, చేబోలు నాగేశ్వరరావు, తాడేపల్లి మోహన్‌రావు, గమని రాంబాబు, కాకర్ల వినాయక, ఆలపాటి నాగేశ్వరరావు, బుద్ధారపు పుల్లయ్య పాల్గొన్నారు.

## ఆర్‌బికెలో అందుబాటులో ఎరువులు

**ప్రజాశక్తి - అత్తిలి**

ప్రతి రైతు భరోసా కేంద్రంలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఎఒ టికె.రాజేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ఎరువులను ముందుగానే పరీక్షించి నాణ్యతా ప్రమాణాలు ఉన్న ఎరువులను మాత్రమే రైతు భరోసా కేంద్రంలో పెట్టినట్లు తెలిపారు. ఇప్పటికీ ప్రతి రైతు భరోసా కేంద్రం 20 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు రైతులకు నిర్ణయించిన ధరకు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## టీవీ మెకానిక్ ట్రేడ్‌ను చిన్న పరిశ్రమగా గుర్తించాలి

**ప్రజాశక్తి - పాలకొల్లు**

విజయవాడలో ఎపియుడబ్ల్యుజె ప్రెస్‌క్లబ్‌లో నిర్వచించిన రాష్ట్ర ఎలక్ట్రానిక్స్, టివి మెకానిక్ ట్రేడ్ యూనియన్ కార్యవర్గ సమావేశంలో సంఘ కుటుంబ సంక్షేమ ట్రస్ట్ బోర్డ్ వైస్ ఛైర్మన్‌గా పాలకొల్లుకు చెందిన మానెం బసవరాజును ఏకగ్రీవంగా నియమించారు. ఈ సందర్భంగా బసవరాజు మాట్లాడుతూ ఆధునికత పెరిగిన కొద్దీ తమ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. ప్రభుత్వం తమకు చేయూత ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెల్‌ఫోన్లు, టివి పరిశ్రమను పక్కకు నెట్టి వేశాయని, అందుకే ప్రభుత్వం తమను చిన్న పరిశ్రమగా గుర్తించి విద్యుత్ రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కాళ్ల : సీసలిలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టిడిపి నేతలు

## 'మహిళలకు డ్వాక్రా తీసుకొచ్చిన ఘనత టిడిపిదే'

**ప్రజాశక్తి - కాళ్ల**

మహిళలకు డ్వాక్రా తీసుకొచ్చి వారిని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేసిన ఏకైక పార్టీ టిడిపి అని ఉండి వాటర్ డిసి మాజీ ఛైర్మన్ తోట ఫణిబాబు అన్నారు. మండలంలోని సీసలిలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. తొలుత ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకోవడంతో పాటు పెరిగిన విద్యుత్ ఛార్జీలు, గ్యాస్ ధరలు, ఇంటి, చెత్త పన్ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో టిడిపి నేతలు మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే అన్ని తరగతుల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. వైసిపి హయాంలో అన్ని తరగతుల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షులు బండారు వేణుగోపాలరావు, మహిళశక్తి సభ్యులు పోతల పద్మ, తిరుమలశెట్టి లీలావతి, కొట్టు ఇందిర, తుమ్మగుంట గౌతమి, బోధనపు రత్నకుమారి, టిడిపి నేతలు పాల్గొన్నారు.

**ఆచంట** : రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారంలోకి రావాలని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జెడ్‌పిటిసి సభ్యులు ఉప్పలపాటి సురేష్‌బాబు అన్నారు. మండలంలోని భీమలాపురంలో మంగళవారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నేతలు ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపిపి సూర్యకుమారి, జెడ్‌పిటిసి సభ్యులు సురేష్‌బాబు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో విద్యుత్ ఛార్జీలు, గ్యాస్ ధరలు, చెత్త పన్నులు, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే అన్ని తరగతి ప్రజలకు సమన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కేత మీరయ్య, సర్పంచి గుబ్బల మాధవరావు, నాయకులు బోడపా టి దుర్గాప్రసాద్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**పెనుమంట్ర** : మండలంలోని ఎస్.ఇల్లింద్రపర్రులో మంగళవారం నిర్వహించిన మహిళాశక్తి కార్యక్రమంలో మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ తనయుడు యువ నాయకులు వెంకట్ పాల్గొన్నారు. ఆయనతో పాటు నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జి వెలగల బులిరామిరెడ్డి, మండల అధ్యక్షుడు తమనంపూడి శ్రీనివాస్‌రెడ్డి (బుల్లాలు), పార్టీ గ్రామ అధ్యక్షుడు, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జులు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేరాలు - ఘోరాలు

### కుమార్తె కన్పించడంలేదని తండ్రి ఫిర్యాదు

**ప్రజాశక్తి - వీరవాసరం**

కుమార్తె కనిపించడం లేదని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వీరవాసరం ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కమతాలపల్లికి చెందిన పీతల బేబి ఈ నెల 20వ తేదీ తెల్లవారుజాము నుంచి కనిపించడలేదంటూ తండ్రి పీతల లాజరు వీరవాసరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 19వ తేదీ రాత్రి కుటుంబ సభ్యులు అందరితో పాటు బేబి నిద్రించిందని, తెల్లవారేసరికి ఇంట్లో కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

# బొల్ల శ్రీనివాస్‌కు అభినందన సత్కారం

### విస్సాకోడేరు సర్పంచి సేవలు అమోఘం : డిసిసిబి ఛైర్మన్ పివిఎల్

### నా మిత్రుడుకి అవార్డు రావడం ఆనందదాయకం : ఎంపిపి చంటిరాజు


శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న పివిఎల్ నరసింహమూర్తి, ఎంపిపి చంటిరాజు

**ప్రజాశక్తి - పాలకోడేరు**

రాజీవ్ గాంధీ నేషనల్ మెమోరియల్ అవార్డు అందుకున్న విస్సాకోడేరు సర్పంచి, సర్పంచుల ఛాంబర్ మండల ప్రధాన కార్యదర్శి బొల్ల శ్రీనివాస్‌కు అభినందనలు వెల్లువలా కురిశాయి. రాజకీయ పార్టీలకు అతీతంగా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, అధికారులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, బంధువులు అవార్డు గ్రహీత శ్రీనివాస్‌ను అభినందించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణ రాజు (చంటిరాజు) ఆధ్వర్యంలో అవార్డు గ్రహీత బొల్ల శ్రీనివాస్‌కు అభినందన సత్కార కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఒ మురళిగంగాధరరావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు హాజరై మాట్లాడారు. సర్పంచిగా బొల శ్రీనివాస్ విస్సాకోడేరు గ్రామానికి అందిస్తున్న సేవలు అమోఘమన్నారు. మెయిన్ సెంటర్‌లో అన్ని హంగులతో సచివాలయ భవనాన్ని ఎంతో అందంగా నిర్మించారని చెప్పారు. పారిశుధ్య మెరుగుదలకు డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి అధునాతన పద్ధతిలో చెత్త సేకరణ చేస్తున్నారన్నారు. గ్రామానికి అందిస్తున్న సేవలకు గుర్తుగా జాతీయస్థాయిలో అవార్డు రావడం అభినందనీయమన్నారు. మిగిలిన సర్పంచులు బొల్ల శ్రీనివాస్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఎంపిపి చంటిరాజు మాట్లాడుతూ నా మిత్రుడు బొల్ల శ్రీనివాస్‌కు జాతీయస్థాయి అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దేశంలోనే ఈ జాతీయ అవార్డుకు ఐదుగురు ఎంపిక కాగా రాష్ట్రం నుంచి మిత్రుడు శ్రీనివాస్‌కు రావడం గర్వంగా ఉందన్నారు. గొరగనముడి మాజీ సర్పంచి చెల్లబోయిన పాపారావు మాట్లాడుతూ ఎస్‌సి, బిసి సర్పంచులకు కొన్ని ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉంటాయని, వాటిని అధిగమించి తన సోదరుడు బొల్ల శ్రీనివాస్ విస్సాకోడేరు గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి అవార్డు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఉప ఎంపిపి ఆదాడ లక్ష్మీతులసి మాట్లాడుతూ దేశంలోనే పాలకోడేరు మండలానికి అవార్డు రావడనికి కృషి చేసిన సర్పంచి శ్రీనివాస్‌కు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం అవార్డు గ్రహీత బొల్ల శ్రీనివాస్‌ను డిసిసిబి ఛైర్మన్ పివిఎల్, ఎంపిపి చంటిరాజు ఘనంగా సత్కరించారు. విస్సాకోడేరు గ్రామస్తులు, అభిమానులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, స్నేహితులు శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు భూపతి రాజు వంశీకృష్ణమరాజు, వైసిపి ముఖ్య నేతలు కొత్తపల్లి కాశి విశ్వనాథరాజు, చేకూరి రాజా నరేంద్ర కుమార్, సహదేవరాజు, కోళ్లఫారం శ్రీనివాస్‌రాజు, పెన్నాడ గోపాలకృష్ణంరాజు, సర్పంచులు జంగం సూరిబాబు, కడలి నాగేశ్వరి, ఇంజేటి మరియమ్మ, కడలి విజయలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు బొల్లం గాంధీ, పాల జ్యోతి, నాగలక్ష్మి, స్వాతి, వెంకటలక్ష్మి, శాంతి కుమారి, మల్లుల సూర్యకళ, షేక్ పాప సాహెబ్, పెదపూడి లక్ష్మీపతి, నాయకులు చేయబోలు బాలాజీ, పాల రాధాకృష్ణ, రిచి జాన్‌కిడ్స్, ఉండ్రు శ్రీను, ప్రసాద్ పాల్గొన్నారు.

### అవార్డు నా ఒక్కడి సొంతం కాదు

### అవార్డు గ్రహీత బొల్ల శ్రీనివాస్

తనపై ఆదరభిమానాలు ప్రేమ ఆప్యాయతలు కురిపిస్తున్న ప్రతి ఒక్కరికి రుణ పడి ఉన్నానని అవార్డు గ్రహీత, సర్పంచి బొల్ల శ్రీనివాస్ అన్నారు. జాతీయ స్థాయి అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందని, ఈ అవార్డు నా ఒక్కడి సొంతం కాద ని, అందరిదని చెప్పారు. అవార్డు అందుకోవడానికి గ్రామాన్ని అభి వృద్ధి చేయడానికి పార్టీలకు అతీ తంగా గ్రామస్తు లంతా సహాయ సహకారాలు అందించారన్నారు. ముఖ్యంగా కలెక్టర్ ప్రశాంతి, ఎడ్వర్డ్ పలు సూచనలు సలహాలు అందించారని తెలిపారు.

అవార్డుతో శ్రీనివాస్

## 28న వ్యకాస శిక్షణా తరగతులు

**ప్రజాశక్తి - నరసాపురం టౌన్**

ఈ నెల 28వ తేదీన వేములదీవి గొందుమూల సెంటర్‌లో నిర్వహించే వ్యవసాయ కార్మిక సంఘం శిక్షణ తరగతుల జయప్రదానికి ప్రతిఒక్కరూ ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు, జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. నరసాపురం మండలంలో ఉన్న వ్యవసాయ కార్మికులకు ఒకరోజు శిక్షణా తరగతులు జయప్రదానికి వేములదీవి గ్రామంలో ఇంటింటికీ తిరిగి విరాళాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కవురు పెద్దిరాజు, జక్కంసెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ, ఆక్వా, రియల్‌ఎస్టేట్ అనేక మార్పు వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ చట్టం పని కీలకంగా మారిందన్నారు. అటువంటి చట్టాన్ని నీరు గార్చేందుకు మోడీ అనేక మార్పులు చేస్తున్నారన్నారు. జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి, జల్లి రామ్మోహన్‌రావు, గుత్తుల రామచంద్రుడు మాట్లాడుతూ కూలీలకు యాప్ ద్వారా మస్టర్ వేసే విధానాన్ని రద్దు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం, డిమాండ్ల సాధన కోసం రానున్న రోజుల్లో ఏవిధంగా పోరాటాలు నిర్వహించాలనేదే ఈ శిక్షణా తరగతుల్లో చర్చిస్తామని తెలిపారు. ఈ విరాళాల సేకరణ కార్యక్రమంలో కవురు శ్రీను భాస్కరరావు, గుత్తుల ప్రసాద్, కేతా రామారావు పాల్గొన్నారు.

## 26న పెనుమంట్ర మండల సమావేశం

**ప్రజాశక్తి - పెనుమంట్ర**

మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 26వ తేదీన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిపి కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసురెడ్డి) అధ్యక్షతన వహిస్తారని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని పేర్కొన్నారు.

## తామరాడలో వైద్య శిబిరాలు నిర్వహించాలి : సిపిఎం

**ప్రజాశక్తి - పెనుగొండ**

మండలంలోని తామరాడ గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించి డెంగీ బాధితులకు చికిత్స అందించాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు కోరారు. మండలంలోని తామరాడ గ్రామంలో అపారిశుధ్యం కారణంగా ప్రజలు దోమ కాటుకు గురై అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. గ్రామంలో పలువురు అనారోగ్య బాధితులను సిపిఎం నాయకులు మంగళవారం కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, గ్రామ నాయకులు వెంకట్రావు మాట్లాడుతూ గ్రామంలో డెంగీ జ్వరాలను అదుపు చేయాలని సర్పంచి కోట సత్యనారాయణను, కార్యదర్శి వై.శ్యామలను కలిసి కోరినా వారు పట్టించుకోలేదన్నారు. పారిశుద్యాన్ని మెరుగుపరిచి ప్రజల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేశారు.

## రసాభాసగా మున్సిపల్ సాధారణ సమావేశం

**ప్రజాశక్తి - నరసాపురం టౌన్**

జనసేన కౌన్సిలర్ సస్పెన్షన్‌ను రద్దు చేయాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. నరసాపురం మున్సిపల్ హాలులో మున్సిపల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ వెంకటరమణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సమావేశంలో ప్రతిపక్ష సభ్యులు మాట్లాడుతూ గత సమావేశంలో 22వ వార్డు సభ్యుడు ప్రజా సమస్యలపై ప్రశ్నించినందుకు సమావేశం నుంచి బహిష్కరించడం సరికాదని, సస్పెండ్ వేటు ఎత్తివేసి సమావేశానికి పిలవాలని కోరారు. ప్రతిపక్ష, అధికారపక్ష సభ్యుల మాటలతో సభ రసాబాసాగా సాగింది. సస్పెండ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జనసేన సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంఎల్ఎ, ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలకు మంచి చేయడమే తమ అజెండా అని చెప్పారు.

## స్నేక్ స్కూల్ వ్యవస్థాపకులు సుబ్బారావుకు సతీ వియోగం

**ప్రజాశక్తి - ఆచంట**

సత్యవతి (ఫైల్)

ఆచంట గ్రామానికి చెందిన రిటైర్డ్ సైంటిస్ట్, స్నేక్ స్కూల్ వ్యవస్థాపకులు, కో-ఆపరేటివ్ సొసైటీ మాజీ ఉపాధ్యక్షులు, డాక్టర్ సి.సుబ్బారావు భార్య చిలుకూరి సత్యవతి(82) సోమవారం తెల్లవారుజామున హైదరాబాద్ నిజాంపేటలో ఆమె కుమార్తె నివాసం వద్ద అనారోగ్యంతో మృతి చెందారు. ఆమెకు భర్త సుబ్బారావు, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆమె మృతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కేతా గోపాలన్, వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్, టిడిపి నాయకులు తమ్మినీడి ప్రసాద్, గొడవర్తి శ్రీరాములు, వెలిచేటి మోహన్‌రావు, వెలిచేటి భరద్వాజ, వైట్ల శ్రీను, ప్రేమ్‌కుమార్, సిపిఎం మండల నాయకులు కార్యకర్తలు, స్నేక్ స్కూల్ సిబ్బంది సంతాపం తెలిపారు. సత్యవతి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు

## ట్రాఫిక్ సమస్య లేకుండా చూడండి : గ్రంధి

**ప్రజాశక్తి - భీమవరం రూరల్**

భీమవరంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్‌పై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని పోలీసు అధికారులను ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం స్థానిక క్యాంపు కార్యాలయంలో వన్‌టౌన్, టూ టౌన్ సిఐలు అడబాల శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్, ఎస్ఐ అప్పారావులతో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా రైల్వే శాఖ సహకారంతో పట్టణంలో అండర్ టన్నెల్స్‌ను నిర్మించినట్లు చెప్పారు. ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూల్ బస్సులు కూడా ఎక్కువగా వెళ్తున్న నేపథ్యంలో ప్రజలకు ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## 'స్వర్ణాంధ్ర'లో నేషన్స్ ఫెస్ట్‌పై అవగాహనాసదస్సు

వెంకట్రావును సత్కరిస్తున్న కళాశాల మేనేజ్‌మెంట్

**ప్రజాశక్తి - నరసాపురం టౌన్**

మండలంలోని సీతారాంపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ అటానమస్ కళాశాలలో ఐక్యూఎసి వారి ఆధ్వర్యంలో రిటైర్డ్ మేజర్ జనరల్ బివి.రావుతఖుకు వారిచే నేషన్స్ ఫెస్ట్ అనే అంశంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మేజర్ జనరల్ బివి.రావు మాట్లాడుతూ జాతీయ భద్రతలో సాయుధ దళాల పాత్ర, పౌరుల బాధ్యత గురించి ఆర్మీ కోర్సుల్లో విద్యార్థులు ఏ విధంగా ప్రవేశించాలో దానికి సంబంధించిన సలహాలు, సూచనలు విద్యార్థులకు అందించారు. వివిధ డిపార్ట్‌మెంట్ విభాగాధిపతులు, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్స్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.గోపీచంద్ మాట్లాడారు. ఈవెంట్ కో-ఆర్డినేటర్‌గా సురేష్‌కుమార్ పాల్గొన్నారు. చీఫ్ గెస్ట్ మేజర్ జనరల్ బి.వెంకట్రావును కళాశాల మేనేజ్‌మెంట్ వారు ఘనంగా సత్కరించారు.

# మరోసారి వైసిపిని గెలిపించాలి : పివిఎల్


వైసిపిలోకి చేరినవారితో పివిఎల్ నరసింహమూర్తి

**ప్రజాశక్తి - కాళ్ల**

ప్రజల శ్రేయస్సు కోసం సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించి సిఎం జగన్మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని పెదఅమిరం వైసిపి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తొలుత కాళ్లకూరు గ్రామం నుంచి ఆటోలు, మోటార్ సైకిల్ ర్యాలీతో 200 మంది కార్యకర్తలు పెదఅమిరం వైసిపి కార్యాలయానికి చేరుకున్నారు. కాళ్లకూరులో టిడిపి, జనసేన పార్టీల గుడిసె అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో సుమారు 30 మంది పివిఎల్ నరసింహరాజు సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పివిఎల్.నరసింహంరాజు మాట్లాడుతూ 2019 అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి ఎంఎల్ఎను గెలిపించినా గ్రామాల్లో ఏ పనీ చేయలేదన్నారు. వైసిపి ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు వాలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి దిగ్విజయంగా కొనసాగిస్తుందన్నారు. దళారుల ప్రమేయం లేకుండా మహిళల బ్యాంకు ఖాతాల్లో చేయూత, ఆసరా సొమ్ము జమ చేస్తున్నట్లు చెప్పారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు జగన్‌కు అండగా ఉండి గెలిపించాలని కోరారు. గుడిసె అనిల్‌కుమార్ మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బొర్రా వీరవెంకటసత్యనారాయణ (పెద్ద బుజ్జి), వేగేశ్న రవితేజ, దావులూరి సామేలు, పి.భరత్, దాట్ల వెంకట రామరాజు, వేగేశ్న రామకృష్ణంరాజు, మండల కో-ఆప్షన్ సభ్యుడు గుర్రం జార్జ్ బెనహర్, వైసిపి నాయకులు వెంకట్రావు, గెద్దడ యోహాన్, ఈదా యాకోబు పాల్గొన్నారు.

# ఘనంగా చిరంజీవి పుట్టినరోజు వేడుకలు

## అభిమానుల రక్తదానం

**ప్రజాశక్తి - కాళ్ల**

చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా యువత రక్తదానాన్ని ఇచ్చేందుకు ముందుకు రావడం అభినందనీయమని పలువురు అన్నారు. కాళ్ల గ్రామంలో చిరంజీవి పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. చిరంజీవి అభిమానులు, హోప్ ఛారిటబుల్ ట్రస్ట్, ఆనంద్ బ్లడ్ బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 55 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బంధా విజయ, జనసేన కాళ్ల గ్రామ అధ్యక్షుడు బండారు సోమేశ్వరరావు, నాయకులు చవ్వాకుల నాని, జెట్టిబోయిన పోతురాజు, మేకా వీరాస్వామి, చెన్నూరి భరత్‌కుమార్, మదాసు సత్యనారాయ ణ, బండారు పుండరీకాక్షుడు, రామనగేష్ పాల్గొన్నారు.

**పాలకొల్లు** :మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాలను పాలకొల్లులో చిరంజీవి యువత ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి తులా రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆపద్బంధు బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. జనసేన పట్టణ అధ్యక్షులు శిడగం సురేంద్ర కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలను ప్రారంభించారు. 40 మంది చిరంజీవి అభిమానులు రక్తదానం చేశారు. వీరికి చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్, హైదరాబాద్ నుంచి చిరంజీవి, రామ్‌చరణ్ సంతకాలతో కూడిన అభినందన పత్రాలు తులా రామలింగేశ్వరరావు చేతులమీదుగా అందించారు. పెదమామిడిపల్లి, అబ్బిరాజుపాలెంలో రెండు రోజులు కార్యక్రమాలు నిర్వహించామని, మంగళవారం పాలకొల్లులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆచంట చరణ్‌దీప్, తులా సురేష్, మల్లిపూడి సాంబ, మోపిదేవి అప్పారావు, వెలిగట్ల శ్రీను, కాపిశెట్టి పెదకాపు, సిరిగినీడి అంజనీకుమార్, సాధనాల దుర్గాబాబు, సాయి, అఖిల్, అలుగు సత్తిబాబు పాల్గొన్నారు.

కాళ్లలో రక్తదానం చేస్తున్న చిరంజీవి అభిమానులు

**భీమవరం రూరల్** : మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకల సందర్భంగా భీమవరం చిరంజీవి యువత ఆధ్వర్యంలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. భీమవరం అంకాల ఆర్ట్ అకాడమీ భవనంలో కేకును సూర్యమిత్ర ఎగ్జిమ్స్ సిఇఒ యిర్రింకి గంగారామ్ ముఖ్య అతిథిగా హాజరై కట్ చేసి అభిమానులకు అందించి మాట్లాడారు. చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉండపల్లి రమేష్‌నాయుడు, భీమవరం టౌన్ వైడ్ మెగా ఫ్యాన్స్ అధ్యక్షులు చల్లా రాము, సంఘ సేవకులు అల్లు శ్రీనివాస్ మాట్లాడారు. తొలుత యిర్రింకి గంగారామ్ స్వచ్ఛంద రక్తదానం చేశారు

**పెనుమంట్ర** : మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా మార్టేరు ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో గర్భిణులకు చిరంజీవి యువత జిల్లా సెక్రటరీ వరికోటి చిరంజీవి సమక్షంలో చిరంజీవి వీరాభిమాని షేక్ మహమ్మద్ ఆలీ అధ్యక్షతన మంగళారం ప్రోటీన్ పౌడర్ అందించారు.

**నరసాపురం టౌన్** : చిరంజీవి పుట్టినరోజు వేడుకలను జనసేన నరసాపురం నియోజకవర్గ కార్యాలయంలో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీర మహిళలు, చిరంజీవి అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**మొగల్తూరు** : మొగల్తూరులోని చిరంజీవి గ్రంథాలయం వద్ద మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను చిరంజీవి యువత మండల శాఖ అధ్యక్షుడు దాసరి కృష్ణాజి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బొమ్మిడి సునీల్, కోపెల్లి శ్రీనివాస్, వలవల నాని, లక్కు బాబి, ఆకన చంద్రశేఖర్, రాంబాబు పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం** : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బిసి సంఘాల అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, 108 వాహన రాష్ట్ర ఉపాధ్యక్షుడు నీలపాల దినేష్ యాదవ్ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం సినిమా హాల్ వర్కర్స్ అందరకీ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చిరంజీవి యువత కార్యదర్శి గట్టు గోపీకృష్ణ, పుల్లా బాబి, గుండుమోగుల సురేష్, కేశవబట్ల విజయ్ పాల్గొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కాపు యువత అధ్యక్షులు మారిశెట్టి అజయ్‌బాబు ఆధ్వర్యంలో భీమవరం రోడ్డులో చిరంజీవి బస్ షెల్టర్ వద్ద కేక్ కట్ చేశారు. అనంతరం బ్రెయిన్ సర్జరీ క్రిటికల్ కండీషన్‌లో ఉన్న జువ్వలపాలెం జనసైనికుడు కె.కల్యాణ్‌గుప్తాకు మారిశెట్టి అజయ్‌బాబు, యువసేన, తాడేపల్లిగూడెం నియోజకవర్గ చిరంజీవి యువత అధ్యక్షులు పాలూరి శేషు నాయుడు ఆధ్వర్యంలో రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. పడాల వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. మాజీ ఎంఎల్ఎ ఈలి వెంకట మధుసూదన్‌రావు (నాని) పడాల వృద్ధాశ్రమంలో కర్రి సత్యనారాయణ సారథ్యంలో వృద్ధులకు భోజనాలు, పండ్లు స్వీట్స్ పంపిణీ చేశారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**ప్రజాశక్తి - ఆకివీడు**

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సిఐ కెవివిఎన్.సత్యనారాయణ సూచించారు. పట్టణంలో గంజాయి నివారణ చర్యలు చేపడతామని చెప్పారు. మంగళవారం సాయంత్రం ఆయన నూతనంగా విధుల్లో చేరిన ఎస్ఐ ఫణిమోహన్‌తో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గంజాయి కలిగి ఉన్నా, సరఫరా చేసినా, విక్రయించినా, సేవించినా కేసు నమోదు చేస్తామన్నారు. పట్టణంలో గంజాయి అరికట్టడానికి ప్రజలు, మీడియావారు, ప్రజాహిత సంస్థలు, ప్రముఖులు తమకు సహకరించాలని ఆయన కోరారు.

## ఐటిఐలో కౌన్సెలింగ్‌కు దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాశక్తి - ఆచంట**

ఆచంటలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటిఐ)లో 2023-2024 విద్యా సంవత్సరానికి సంబంధించి మూడో విడత కౌన్సెలింగ్‌కు ఆన్‌లైన్ వెబ్‌సైట్ iti.ap.gov.in ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపల్ ఐవి.సత్యనారాయణరాజు మంగళవారం తెలిపారు. ఈ నెల 27వ తేదీ ఆదివారం సాయంత్రం ఐదు గంటలలోపు ప్రభుత్వ ఐటిఐలో సంబంధిత సర్టిఫికెట్లు అందించాలని తెలిపారు. ఈ నెల 30వ తేదీ బుధవారం నిర్వహించే కౌన్సెలింగ్‌కు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9490111002 సంప్రదించాలని తెలిపారు.

## ప్రకాశం చౌక్‌లో టంగుటూరి విగ్రహం ఏర్పాటుకు కృషి

**ప్రజాశక్తి - భీమవరం రూరల్**

స్వాతంత్ర ఉద్యమంలో ఉద్యమ కారుడు, టంగుటూరి ప్రకాశం పంతులు భీమవరం వచ్చి జెండా ఎగరవేసిన ప్రదేశానికి ప్రకాశం చౌక్ అని నామకరణం చేయటం గొప్ప విశేషమని, అదే ప్రాంతంలో ఆయన విగ్రహం పెట్టడానికి అనేకమార్లు ప్రస్థానంలోకి వచ్చిందని, జిల్లా కేంద్రమైన సందర్భంలో అధికారులతో సంప్రదించి ప్రకాశం చౌక్‌లో ప్రకాశం విగ్రహాన్ని నెలకొల్పుతామని భీమవరం ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ప్రకాశం పంతులు జయంతోత్సవ కమిటీ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి ప్రకాశం చౌక్ నామకరణం, ప్రకాశం ఉద్యమం, భీమవరంతో ప్రకాశానికి సంబంధాల గురించి వివరించి ప్రకాశం చౌక్‌లో విగ్రహాన్ని నెలకొల్పాలని కోరారు. భీమవరం జిల్లా కేంద్రమైన సందర్భంలో ప్రకాశం చౌక్‌లో ప్రకాశం పంతులు విగ్రహం నెలకొల్పడం అందరికీ సమ్మతమేనని, భీమవరం ప్రజలంతా ఈ విషయాన్ని సమర్థిస్తున్నారని రంగసాయి తెలిపారు. జయంతోత్సవ కమిటీ సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాస్, గంట సుందర్ కుమార్ మాట్లాడుతూ విగ్రహం నెలకొల్పాలని కోరారు. దీనికి స్పందించిన ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ తప్పకుండా ప్రకాశం చౌక్‌లో విగ్రహం నెలకొల్పేందుకు కృషి చేస్తానని చెప్పారు.

**సవరణ దస్తావేజు పోయినది**

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, సీతారామపురం వాస్తవ్యులు చిన్ని సాంబశివరావు గారి కుమారుడు అయిన చిన్ని సుబ్బారావు పేరన ఈదర గ్రామంలోని ఆర్.యస్.నెం. 780లో య.2-00 సెంట్లు భూమికి సంబంధించిన సవరణ దస్తావేజు (నెం.4544/2019) పోయినది. ఆచూకీ తెలిసిన వారు ఈ క్రింది అడ్రసుకు తెలియపర్చగలరు.

చిన్ని సుబ్బారావు
తండ్రి: సాంబశివరావు, సీతారామపురం గ్రామం, ఆగిరిపల్లి మండలం, ఏలూరు జిల్లా.
సెల్: 99483 23537